ఆర్థిక వృద్ధి... అభివృద్ధి... తేడా ఇది.. !

ఆర్థిక వృద్ధి, ఆర్థికాభివృద్ధి ఈ రెండూ పర్యాయ పదాలుగా ఉపయోగిస్తున్నప్పటికీ సిద్ధాంత రీత్యా వీటికి వేర్వేరు అర్థాలు ఉన్నాయి. షుంపీటర్, హిక్స్ మాడిసన్ లాంటి ఆర్థికవేత్తలు వీటి మధ్య స్పష్టమైన వ్యత్యాసాలను చూపించారు. వృద్ధి, అభివృద్ధి, కొనసాగించగలిగే అభివృద్ధి అనే భావనలను పరిశీలిద్దాం.

వృద్ధి: దేశంలో వస్తుసేవల ఉత్పత్తిలో వచ్చే పెరుగుదలను ఆర్థిక వృద్ధి అంటారు. ఉదా: దేశ స్థూలజాతీయోత్పత్తిలో వచ్చే పెరుగుదల, తలసరి ఆదాయంలో వచ్చే పెరుగుదల, ఆర్థికవృద్ధి పరిమాణాత్మక మార్పును సూచిస్తుంది. అయితే ఉత్పత్తి పెరుగుదల దీర్ఘకాలికంగా ఉండాలి. తలసరి వాస్తవిక ఉత్పత్తి పెరగాలి.

ఆర్థికాభివృద్ధి: దేశంలో ఉత్పత్తి పెరుగుదలతో పాటు, వ్యవస్థాపూర్వక, సాంకేతిక మార్పులతో కూడిన గుణాత్మక మార్పును అభివృద్ధి అంటారు. వృద్ధి కంటే అభివృద్ధి సమగ్రమైన భావన.

ఆర్థికాభివృద్ధి = ఆర్థికవృద్ధి+వ్యవస్థా పూర్వకమైన మార్పులు
= వృద్ధి+పేదవారికి అనుకూలంగా వనరులు పునఃపంపిణీ చేయడం

ఆర్థికవృద్ధి-ఆర్థికాభివృద్ధి:

వృద్ధిని వ్యక్తి శారీరక పరిమాణంలో వచ్చే మార్పులతోను, అభివృద్ధిని వ్యక్తిత్వం, మేధస్సులో వచ్చే మార్పులతో పోల్చవచ్చు.

అల్పాభివృద్ధి దేశాల సమస్యలకు సంబంధించిన ఆర్థికాభివృద్ధి కాగా, అభివృద్ధి చెందిన దేశాల సమస్యలకు సంబంధించింది ఆర్థికవృద్ధి అని 'శ్రీమతి హిక్స్' పేర్కొన్నారు. వృద్ధి, అభివృద్ధి మధ్య వ్యత్యాసాన్ని చూపిస్తూ, 'కిండిల్ బర్గర్' ఆర్థిక వృద్ధి అంటే అధిక ఉత్పత్తి అని, ఆర్థికాభివృద్ధి అంటే అధిక ఉత్పత్తితో పాటు వ్యవస్థాపూర్వక, సాంకేతిక మార్పులకు సంబంధించిందని పేర్కొన్నారు. అభివృద్ధి లేకుండా వృద్ధి జరిగితే వృద్ధిఫలాలు కొద్దిమందికే చేరతాయి. అరబ్ దేశాల్లో పెట్రోలు ఎగుమతుల ద్వారా జాతీయాదాయం, తలసరి ఆదాయం పెరిగినప్పటికీ ఆ దేశాలు స్వయంసమృద్ధిని సాధించడానికి అవసరమైన గట్టి పునాదిని ఏర్పాటు చేసుకోలేకపోయాయి. 'రాబర్ట్ క్లోవర్' తన 'Growth without Deve lopment' అనే గ్రంథంలో లైబీరియా దేశంలో అభివృద్ధి లేకుండా వృద్ధి ఏ విధంగా జరిగిందో వివరించారు.

వృద్ధిరేటు: సాంవత్సరిక జాతీయ ఆదాయ వృద్ధిరేటు ఆధారంగా ఆర్థికవృద్ధిని గణిస్తారు.

వృద్ధిరేటును గణించే విధానం:

$$G_t = \frac{Q_t - Q_{t-1}}{Q_{t-1}} \times 100$$

ఇందులో

G_t = t కాలంలో వృద్ధిరేటు

Q_t = t కాలంలో స్థూలదేశీయోత్పత్తి

Q_{t-1} = t-1 కాలంలో స్థూలదేశీ యోత్పత్తి

కొనసాగించగలిగే అభివృద్ధి: భవిష్యత్ తరాల అవసరాలు తీర్చుకునే సామర్థ్యం దెబ్బతీయకుండా ప్రస్తుత తరం, తమ అవసరాలు తీర్చుకోవడమే కొనసాగించగలిగే అభివృద్ధి అని 'బ్రట్‌లాండ్ కమిషన్' 1987లో నిర్వచించింది. ప్రపంచ పర్యావరణ అభివృద్ధి కమిషన్ "Our common future' అనే సెమినార్ రిపోర్ట్‌లో ఈ పదాన్ని మొదటిసారిగా ఉపయోగించారు. అభివృద్ధి పరుగుపందెంలో ప్రతి దేశం వనరులను వేగంగా వినియోగించడం వల్ల సహజవనరులు క్షీణించి, పర్యావరణం దెబ్బతిని ప్రస్తుత తరం జీవన పరిస్థితులు క్షీణించడమే కాక భవిష్యత్ తరాలకు కాలుష్యపూరిత పరిస్థితులు అందిస్తున్నాం. ఇలాంటి పరిస్థితులను నిరోధిస్తూ అభివృద్ధిని సాగించడమే కొనసాగించగలిగే అభివృద్ధి. అంటే వనరులను, పర్యావరణాన్ని పరిరక్షించడమే కొనసాగించగలిగే అభివృద్ధి.

ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇలా రావొచ్చు

1. వృద్ధి, అభివృద్ధి భావనలకు సంబంధించి కిందివాటిలో దేనిని వృద్ధిగా భావిస్తారు? (2008 సివిల్స్)
   ఎ) ద్రవ్యరూపంలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల
   బి) ద్రవ్యరూపేణా తలసరి ఆదాయం వృద్ధి
   సి) వాస్తవ స్థూలజాతీయోత్పత్తి పెరుగుదల
   డి) వాస్తవ తలసరి ఆదాయం వృద్ధి
2. ఆర్థికాభివృద్ధి అంటే (2008 ఏ.ఎస్.ఓ)
   ఎ) తలసరి ఆదాయం పెరుగుదల
   బి) సంతులిత వృద్ధి
   సి) నిర్మాణాత్మక మార్పులతో పాటు వృద్ధి
   డి) భారీ పరిశ్రమల అభివృద్ధి
3. 'ట్రికిల్‌డౌన్' (Trickle Down) అభివృద్ధి వ్యూహం అంటే? (2008 ఏ.ఎస్.ఓ)
   ఎ) వృద్ధి జరిగితే పేదరికాన్ని దానికదే నిర్మూలిస్తుంది

బి) దారిద్ర్య నిర్మూలన వృద్ధికి దారితీస్తుంది
సి) ప్రత్యేక కార్యక్రమాలు దారిద్ర్య నిర్మూలనకు అవసరం
డి) చిన్నతరహా రంగాల వృద్ధి

4. కొనసాగించగలిగే (నిలదొక్కుకునే) అభివృద్ధి దీనికి వర్తిస్తుంది. (గ్రూప్-2 2005)
ఎ) ప్రస్తుత తరం అవసరాలను, భవిష్యత్ తరాల వారి అవసరాలను పాడుచేయకుండా తీర్చడం
బి) భవిష్యత్ తరాల వారి అవసరాలను ప్రస్తుత తరంవారి అవసరాలను పక్కకు పెట్టకుండా తీర్చడం
సి) ప్రస్తుత తరం వారి అవసరాలను పక్కకు పెట్టి భవిష్యత్ తరాల అవసరాలను తీర్చడం
డి) ప్రస్తుత తరం అవసరాలను భవిష్యత్ తరాల వారి అవసరాలను పక్కకు పెట్టి నెరవేర్చడం

5. ఆర్థికాభివృద్ధి భావన అంటే(ఏపీపీఎస్సీ-2001)
ఎ) ఆర్థికవృద్ధితో పోలిస్తే సంకుచితమైన భావన
బి) ఆర్థికవృద్ధితో సమానం
సి) ఆర్థికవృద్ధితో పోలిస్తే విస్తృతమైన భావన
డి) ఆర్థికాభివృద్ధితో ఏ విధంగానూ సంబంధం లేనిది

6. ఆర్థికాభివృద్ధి అంటే ఆర్థికవృద్ధితో పాటు..... (ఏపీపీఎస్సీ-2001)
ఎ) ధరల స్థిరత్వం బి)ద్రవ్యోల్బణం
సి) ప్రతిద్రవ్యోల్బణం డి)సామాజిక మార్పు

7. 'ఆర్థికాభివృద్ధి' అంటే (సివిల్స్-1997)
1) నిరంతర ప్రక్రియ
2)స్వల్పకాలిక ప్రక్రియ
3) దీర్ఘకాలిక ప్రక్రియ
ఎ) 2 మాత్రమే బి) 1, 3
సి) 3 మాత్రమే డి) 1, 2

8. ఆర్థికాభివృద్ధి ప్రక్రియ దేనిని తెలుపుతుంది (సివిల్స్ -2003)
ఎ) దీర్ఘకాలంలో జాతీయాదాయంలో వృద్ధి
బి) తలసరి ఆదాయం, జీవన ప్రమాణాల వృద్ధి
సి) మొత్తం జనాభాకు సంపూర్ణ ఉద్యోగిత
డి) జాతీయాదాయ వృద్ధితో పాటు ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాపూర్వక మార్పులు

9. ఆర్థికవృద్ధి అనే భావన?
ఎ) ఆర్థికాభివృద్ధి అనే భావనతో సమానమైంది
బి) ఆర్థికాభివృద్ధి అనే భావన కంటే సంకుచితమైంది
సి) ఆర్థికాభివృద్ధి అనే భావన కంటే విశాలం
డి) ఆర్థికాభివృద్ధి అనే భావనతో సంబంధం లేదు

10. ఆర్థికవృద్ధి, అభివృద్ధి రెండూ?
ఎ) సమానం బి) వేర్వేరు
సి) అనుపాతం డి) విలోమం

11. ఆర్థికాభివృద్ధిలో భాగాలుగా ఉండేది?
ఎ) పరిమాణాత్మక సూచికలు బి) గుణాత్మక సూచికలు
సి) ఎ, బి డి) ఎ లేదా బి

12. ఆర్థికవృద్ధి అనే భావన ఏ దేశాలకు చెందింది?
ఎ) అభివృద్ధి చెందిన దేశాలు బి) అల్పాభివృద్ధి దేశాలు
సి) యూరోపియన్ దేశాలు డి) పైవేవీ కావు

13. ఆధునిక ఆర్థికవృద్ధికి సంబంధించి సరైనది?
ఎ) ఆధునిక ఆర్థికవృద్ధి గ్రంథ రచయిత - సైమన్ కుజ్‌నెట్స్
బి) ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించింది
సి) ఎ, బి డి) ఏదీకాదు

14. ఆర్థికాభివృద్ధికి సంబంధించి సరైనది ఏది?
ఎ) ఇది నిర్మాణాత్మక మార్పులతో కూడిన వృద్ధికి చెందింది
బి) ఇది అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించింది
సి) వృద్ధి కన్నా విశాలమైంది, పంపిణీ స్వభావాన్ని తెలుపుతుంది
డి) పైవన్నీ సరైనవే

జవాబులు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
D	C	A	A	C	D	B	D	B	B	C	A	C	D

అభివృద్ధి సిద్ధాంతాలు

అభివృద్ధి దశలను విశ్లేషణ చేసిన వారిలో కార్ల్‌మార్క్స్, సైమన్ కుజ్నెట్స్, రోస్టోవ్ ముఖ్యులు.

ఎ) కార్ల్‌మార్క్స్ అభివృద్ధి దశలు

మార్క్స్ చారిత్రాత్మక దృష్టితో సామాజిక పరిణామంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉద్భవించింది. చివరికి ఈ వ్యవస్థ ఎటు దారి తీసింది విశ్లేషించాడు. అభివృద్ధి దశలను 6 దశలుగా వివరించాడు. అవి–

1) ఆదిమ సమాజం 2) బానిస దశ 3) భూస్వామ్య దశ 4) పెట్టుబడిదారీ విధానం 5) సామ్యవాదం 6) కమ్యూనిజం.

మొదట 'ఆదిమ కమ్యూనిజం' ఉంటుందని దీని స్థానంలో బానిస దశ ఏర్పడి తర్వాత భూస్వామ్యదశగా మారుతుందన్నాడు. నూతన సాంకేతిక పద్ధతులు ఆవిర్భవించడం వల్ల 'పెట్టుబడిదారీ వ్యవస్థ' ఏర్పడి ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గంగా చీలిపోతుంది. ఒకవైపు పెట్టుబడిదారుల సంఖ్య రోజురోజుకి క్షీణించగా.. మరోవైపు శ్రామికవర్గం పెరిగి, పెట్టుబడిదార్లపై తిరుగుబాటు చేసి సామ్యవాదాన్ని, చివరకు కమ్యూనిజాన్ని ఏర్పాటు చేస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో నూతన యంత్రాలు ప్రవేశపెట్టడం వల్ల పెరిగే నిరుద్యోగులను కార్ల్‌మార్క్స్ 'ఇండస్ట్రియల్ రిజర్వు ఆర్మీ' (Industrial Reserve Army)గా పిలిచాడు. వస్తువు విలువ స్థిర మూలధనం (Constant Capital), చరమూలధనం (Variable Capital), మిగులు విలువ (Surplus Value)లపై ఆధారపడుతుంది. మార్క్స్ మూడు భావనలు ఉపయోగించాడు

1. శ్రామిక దోపిడి = $\frac{\text{మిగులు విలువ}}{\text{చరమూలధనం}}$

$= \frac{S}{V}$

2. ఆర్గానిక్ కాంపొజిషన్ ఆఫ్ కాపిటల్ = $\frac{\text{స్థిరమూలధనం}}{\text{స్థిర + చరమూలధనం}}$

$= \frac{C}{C+V}$

3. లాభాల రేటు = $\frac{\text{మిగులు విలువ}}{\text{స్థిర+చరమూలధనం}}$

శ్రామిక దోపిడి పెరిగేకొద్దీ లాభాల రేటు పెరుగుతుందని, OCC పెరిగేకొద్ది లాభాల రేటు తగ్గుతుంది అని పేర్కొన్నాడు. తర్వాత కాలంలో మార్క్స్ సిద్ధాంతాన్ని వి.ఐ. లెనిన్ విస్తరించాడు.

బి) సైమన్ కుజ్నెట్స్ సిద్ధాంతం

ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో దేశాలు వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలుగా ఉంటాయి. సాంకేతికాభివృద్ధి జరిగేకొద్దీ వ్యవసాయరంగం వాటా తగ్గి, పారిశ్రామిక రంగానికి, తర్వాత దశలో సేవారంగానికి ఆర్థిక వ్యవస్థ మరలుతుంది. శ్రామికశక్తిలో కూడా ఇలాంటి మార్పులే వస్తాయి.

సి) W.W రోస్టోవ్ వృద్ధి దశల సిద్ధాంతం

'A non-communist manifesto'గా పిలిచే రోస్టోవ్ రాసిన 'The stages of economic growth' అనే గ్రంథంలో వృద్ధి దశలను 5గా విభజించారు.

1) **సాంప్రదాయక సమాజం:** న్యూటన్ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి పూర్వమున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఏర్పడిన పరిమితమైన ఉత్పత్తి ఫలం ఆధారంగా నిర్మితమైన సమాజం. దీనిని 'ప్రీ ఇండస్ట్రియల్ స్టేజ్' అంటారు.

2) **ప్లవన దశకు కావల్సిన ముందు పరిస్థితులు:** ఇది మార్పుకాలానికి (Period of transition) చెందింది. ఈ కాలంలో వ్యవసాయరంగంలో సాంకేతిక విప్లవం రావాలి. ఎగుమతులు విస్తరించాలి. సాంఘిక వ్యవస్థా మూలధనంలో పెట్టుబడులు పెరగాలి.

3) **ప్లవన దశ** (Take off): రోస్టోవ్ దశల్లో అతి ముఖ్యమైన దశ ప్లవన దశ. ఈ దశలో పొదుపు–పెట్టుబడులు 5 నుంచి 10 శాతం ఆ పైన పెరుగుతాయి. మొదటగా ఈ దశను 'ఇంగ్లండ్' చేరుకుంది. ఇండియా 1952లో ప్లవన దశలోకి ప్రవేశించి, 1964–65లో ప్లవన దశను దాటింది.

4) **పరిపక్వ దశకు గమనం:** దీనిని 'Stage of self sustained growth' అంటారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని రంగాల లోనూ వినియోగిస్తారు. ఈ దశను కూడా ముందుగా ఇంగ్లండ్ చేరుకుంది.

5) **సామూహిక వినియోగ దశ:** ఈ దశలో మన్నిక గల వినియోగ వస్తువుల ఉత్పత్తి వైపు ఆర్థిక వ్యవస్థ మారుతుంది. సమాజం దృష్టి సప్లయ్ నుంచి డిమాండ్‌కు, ఉత్పత్తి సమస్యల నుంచి సంక్షేమ సమస్యల వైపు మారుతుంది. ఈ దశను ముందుగా అమెరికా చేరుకుంది.

అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సినవి

PQLIని రూపొందించింది: డేవిడ్‌మోరిస్(1979)

HDI రూపశిల్పి :– మహబూబ్–ఉల్–హక్

(దీన్ని 1990లో UNDP రూపొందించింది)

ప్రచ్ఛన్న నిరుద్యోగిత: జోన్ రాబిన్‌సన్

సాంకేతిక ద్వంద్వత్వం: బెంజిమన్ హిగ్గిన్స్

సామాజిక ద్వంద్వత్వం: బోకె

ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కేపిటల్ (OCC) : కార్ల్‌మార్క్స్

పారిశ్రామిక రిజర్వు సేన, మిగులు విలువ సిద్ధాంతం: కార్ల్‌మార్క్స్

అభివృద్ధి దశల సిద్ధాంతం : రోస్టోవ్

టేక్ ఆఫ్ (Take-off) : రోస్టోవ్

నవకల్పనలకు ప్రాధాన్యం ఇచ్చింది : షుంపీటర్ (Shumpeator)

పేదరికపు విషవలయాలు: రాగ్నార్ నర్క్సే

సంతులిత వృద్ధి : రాగ్నార్ నర్క్సే

అసంతులిత వృద్ధి : హర్ష్‌మన్ A.O.

ముందు, వెనుక అనుబంధాలు : హర్ష్‌మన్ A.O.

బిగ్ పుష్ : రోజెన్‌స్టీన్ రోడాన్

అవిభాజ్యాలు, బాహ్య ఆదాయాలు : రోజెన్‌స్టీన్ రోడాన్

అపరిమిత శ్రామిక సప్లయ్ : ఆర్థర్ లూయిస్

మార్కెట్ సిద్ధాంతం (Market law): J.B. Say

కనీస కృషి ప్రయత్నం (Critical Minimum Effort) : హార్వే లైబిన్‌స్టీన్

అల్పస్థాయి సమతౌల్య బోను (Low Level Equilibrium Trap): ఆర్.ఆర్. నెల్సన్

స్ప్రెడ్ ఎఫెక్ట్, బ్యాక్‌వాష్ ఎఫెక్ట్ : గున్నార్ మిర్థాల్

వాస్తవ వృద్ధిరేటు, వారెంటెడ్ వృద్ధిరేటు, సహజ వృద్ధిరేటు : హారాడ్

అదృశ్య హస్తం, స్వేచ్ఛా మార్కెట్ యంత్రాంగం, శ్రమ విభజన : ఆడమ్‌స్మిత్

స్వర్ణయుగం : జోన్ రాబిన్‌సన్

అల్ప ఉద్యోగితా సమతౌల్యం (Under Employment Equilibrium) : జె.ఎమ్. కీన్స్

ఉత్పత్తి పద్ధతుల ఎంపిక (Choice of techniques) : ఏ.కె. సేన్

భారీ పరిశ్రమల వ్యూహం: మహలనోబిస్

వేతన వస్తు నమూనా : వకీలు, బ్రహ్మానందం

గాంధేయ వృద్ధి నమూనా : ఎస్.ఎన్. అగర్వాల్(1944)

ఎల్.పి.జి నమూనా (సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ) : డాక్టర్ మన్మోహన్ సింగ్

PURA నమూనా (పట్టణ ప్రాంత సదుపాయాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం) : ఎ.పి.జె. అబ్దుల్ కలాం

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. 'పారిశ్రామిక రిజర్వు సేన' అనే భావన ఉపయోగించినవారు? (ASO-2008)

ఎ) మార్షల్ బి) మాల్థస్

సి) కార్ల్‌మార్క్స్ డి) కీన్స్

2. ప్లవన దశకు ముందు షరతులు ఒక వృద్ధి దశగా తెలిపినవారు? (Dy.EO-2008)

ఎ) లూయిస్ బి) సామ్యూల్‌సన్

సి) డబ్యు.డబ్యు. రోస్టోవ్ డి) లెబైన్‌స్టీన్

3. రోస్టోవ్ ప్రకారం పరిపక్వత దిశవైపు మళ్లింపు దశ? (నాన్ గెజిటెడ్-2005)

ఎ) అభివృద్ధి ప్రక్రియతో మొదలవుతుంది

బి) అభివృద్ధి ప్రక్రియను పూర్తిచేస్తుంది

సి) ప్లవనదశకు ముందు వస్తుంది

డి) ప్లవనదశ తర్వాత వస్తుంది

4. 'మిగులు విలువ' సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారు?

ఎ) మార్షల్ బి) కార్ల్‌మార్క్స్

సి) ఎ.సి. పిగూ డి) సామ్యూల్‌సన్

5. 5 శాతం పెట్టుబడి రేటు నుంచి 10 శాతం లేదా అంతకంటే ఎక్కువ పొదుపు పెట్టుబడులు ఈ దశలో ఉంటాయి?

ఎ) సాంప్రదాయ సమాజం బి) ప్లవన దశకు పూర్వం

సి) ప్లవన దశ డి) పరిపక్వత వైపు నడుపు

6. 'వృద్ధిదశలు' ఎవరికి సంబంధించింది?

ఎ) కార్ల్‌మార్క్స్ బి) డబ్యు.డబ్యు. రోస్టోవ్

సి) షుంపీటర్ డి) గున్నార్ మిర్థాల్

7. మార్క్స్ అభివృద్ధి దశల సిద్ధాంతంలో చివరి దశ?

ఎ) పెట్టుబడిదారీ విధానం బి) సామ్రాజ్యవాదం

సి) కమ్యూనిజం డి) సోషలిజం

8. మార్క్స్ Organic Composition of Capital వీటి నిష్పత్తి తెలుపుతుంది? (Civils-2002)

ఎ) $\frac{C}{V+S}$ బి) $\frac{C}{V}$

సి) $\frac{C}{C+V}$ డి) $\frac{C+V}{V}$

9. డబ్యు.డబ్యు. రోస్టోవ్ ప్రకారం ఏ దశను బదిలీ దశగా పిలుస్తారు?

ఎ) సాంప్రదాయ సమాజం బి) ప్లవన దశకు ముందు దశ

సి) ప్లవన దశ డి) పైవేవీ కావు

జవాబులు	1	2	3	4	5	6	7	8	9
	C	C	D	B	C	B	C	C	B